క్లుప్తంగా

సుబ్బారావు సేవలు అభినందనీయం


నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి వేదాంతం సుబ్బారావు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని వెల్టూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 270మంది విద్యార్థులకు వేదాంతం సుబ్బారావు అందజేసిన రూ.2లక్షల విలువ చేసే నోటు పుస్తకాలు, బ్యాగ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఎంపీపీ యాదమ్మ, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, నాయకులు ఉబేదుల్లా కొత్వా, సుధీర్‌రెడ్డి, పబ్బతి లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, రాజు, కృష్ణమూర్తి, పాండు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు గుమ్మడిదల ఎంపీపీ ప్రవీన అన్నారు. గుమ్మడిదల గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో గ్రామాలను అభివృద్ధి వేగంగా జరుగుతోందని వివరించారు. ఎంపీటీసీలు నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, హుస్సేన్, వెంకటేశం పాల్గొన్నారు.

మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మగ్గం వర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు జులై 01 నుంచి నెల రోజుల పాటు శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9490123839, 9704446956 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ఆశ్రమం కోసం స్థలం దానం

నారాయణఖేడ్: మనూరు మండల కేంద్రంలో దత్తగిరి ఆశ్రమాన్ని నిర్మించేందుకు మనూరుకు చెందిన భక్తురాలు నాగమణి రెండు ప్లాట్ల స్థలాన్ని ఆశ్రమ పీఠాధిపతి అవధూత్‌గిరి మహారాజ్‌కు శనివారం ఉచితంగా వితరణ చేశారు. మనూరులోని పాండురంగ ఆలయం పక్కన ఉన్న ప్లాట్లలో ఆశ్రమాన్ని నిర్మించేందుకు ప్లాట్లను దానం చేస్తూ నాగమణి లిఖిత పూర్వకంగా పీఠాధిపతికి అందజేశారు. మాజీ సర్పంచ్‌లు అంజయ్య, సాయిలు, మోహన్‌రెడ్డి, పాండురంగం, అశోక్‌కుమార్, దత్తు, నర్సింహులు, నగేష్, వఠల్, శంకర్, రాంచందర్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పాదయాత్ర

నారాయణఖేడ్: మృగశిర కార్తె ప్రవేశించి పక్షం రోజులు దాటినా వర్షాలు ఆశించిన మేర కురవకపోవడంతో వరుణుడి కరుణ కోసం మండల పరిధిలోని చాప్టా(కె) గ్రామస్తులు నాగాపూర్, గంగాపూర్, ర్యాకల్, పోతన్‌పల్లి, కొండాపూర్, ఖేడ్ నెహ్రూనగర్, మంగల్‌పేట్ తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో శనివారం జలాభిషేకాలు, ప్రత్యే పూజలు చేశారు. అనంతరం రైతులు, మహిళలు తలలపై తులసి కోటలు, తలపై కలశాలను ఎత్తుకొని భజనలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు.

రెయిన్ కోట్లు పంపిణీ

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని మామిడిపల్లిలో గ్రామ పంచాయతీ కార్మికులకు బూట్లు, గ్లౌజులు, రెయిన్ కోట్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్, మామిడిపల్లి స్పెషల్ ఆఫీసర్ మల్లేశం ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌స్వామి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జోగిపేట(అందోల్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన అందోలు మున్సిపాలిటీ శివారులోని గురుకుల పాఠశాల సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ 2 మొగులయ్య కథనం మేరకు.. అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామానికి చెందిన కుక్కల రాములు, మహేశ్ సంగారెడ్డిలో కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం అందోలు మండలం మన్‌సాన్‌పల్లిలో బంధువుల వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం సంగారెడ్డికి వెళ్తుండగా కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో పోలీసులు ఆ వాహనాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

సోయాబీన్ సాగు.. లాభాలు బాగు

నూనె గింజల పంటగా సోయాబీన్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ పంట ద్వారా భూసారం కూడా పెరుగుతుంది. ఇది స్వల్పకాలిక పంట. వంద రోజుల్లో కోతకు వస్తుంది. పంట సాగుకు అనుకూల సమయం ఇదే.. జూన్ మొదటి వారం నుంచి జులై రెండో వారం వరకు విత్తుకోవచ్చు. వర్షాధార పంటగా జిల్లాలో అధికశాతం మంది రైతులు సోయా చిక్కుడు సాగు చేస్తున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ పంటను సాగుచేయవచ్చని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి సలహాలు, సూచనలతో వివరించారు. ఇతర పంటలతో పోల్చితే శ్రమ, పెట్టుబడులు కూడా తక్కువగానే ఉంటాయి. నల్లరేగడి, తేమ ఎక్కువగా ఉండే బరువు నేలలు పంటసాగుకు అనువైనవి. ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. మెలకువలు పాటిస్తే దిగుబడులను పొందవచ్చని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు.

– జహీరాబాద్ టౌన్


సోయాబీన్ పంట


ఏడీఏ భిక్షపతి

- మెలకువలు పాటిస్తే దిగుబడులు
- డ్రిప్, స్ప్రింకర్ల పద్ధతులు పాటిస్తే మేలు
- వచ్చే నెల వరకు సాగుకు అనుకూలం
- పంట యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ భిక్షపతి సూచన

విత్తన శుద్ధి

సోయాబీన్ విత్తడానికి ముందు కిలో విత్తనాలకు 2 గ్రాముల థైరమ్, 1 గ్రాము కార్బండిజమ్ లేదా 3 గ్రాముల కాప్టన్ మందుతో విత్తన శుద్ధి చేయాలి. 8–10 కిలోల విత్తనానికి 200 గ్రాముల రైజోబియం జపానికం కల్చర్ కలిపి నీడలో ఆరబెట్టి తరువాత విత్తుకోవాలి. చదును చేసిన పొలంలో విత్తనాలు విత్తాలి. నల్లరేగడి నేలలో 45 సెంటీమీటర్ల వెడల్పు, 5 సెంటీ మీటర్ల దూరం, తేలిక పాటి భూముల్లో 30 మీటర్ల వెడల్పు, 7.5 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

నీటి యాజమాన్య పద్ధతులు

సోయా చిక్కుడు వర్షాధార పంట. మొలక, పూత, కాత దశలో నీటి తడులు ఇవ్వాలి. ఆయా దశలో నీటి కొరత లేకుండా జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయి. డ్రిప్, స్ప్రింకర్ల పద్ధతుల్లో పంట సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

ఎరువుల యాజమాన్యం

విత్తనం నాటే ముందు ఎకరానికి 12 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పోటాష్ దుక్కిలో వేయాలి. చివరి దుక్కిలో 4 టన్నుల పశువుల ఎరువు వేయాలి. నెల రోజుల తరువాత మరో 50 శాతం నత్రజని వేయాలి. పూత, కాత దశలో 2 శాతం యూరియా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు వేయాలి. పంటకు చిత్త పురుగులు, రసం పీల్చే పురుగు, కాండం తొలిచే పురుగు, ఈగ ఆకు గూడు పురుగు, పొగాకు, లద్దె పురుగులు ఆశిస్తాయి. నివారణకు 1 గ్రామం ఎస్పీఫేట్ లేదా మోనోక్రోటోఫాస్ 6 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కలుపు నివారణ

మిగతా పంట మాదిరిగా సోయాబీన్‌కు కలుపు బెడద ఉంటుంది. కలుపు నివారణకు పెండియిథాలిన్ 30 శాతం 1.4 లీటర్ల చొప్పున విత్తనం నాటిన మరుసటి రోజు పిచికారీ చేయాలి. 20–25 రోజుల తరువాత గొర్రుతో అంతర కృషి చేయాలి. గడ్డిజాతి మొక్కల నివారణకు కిజాల్‌ఫాస్ ఇథైన్ 5 శాతం 400 మిల్లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

లీకేజీతో తాగునీరు వృథా

నారాయణఖేడ్: మండల పరిధిలోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలో మిషన్ భగీరథ పథకం తాగునీరు పైప్‌లైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతోంది. శుక్రవారం సాయంత్రం లీకేజీ ఏర్పడటంతో నీరు రోడ్డు గుండా పారుతోంది. నిజాంపేట్–నారాయణఖేడ్ 161బీ జాతీయ రహదారిపై వరదగా తాగునీరు పారుతుండటంతో స్థానికులు నీటిని వ్యవసాయ క్షేత్రాల వైపు మళ్లించారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై వృథాగా వెలుతున్న తాగునీరు

ప్రజాసేవ చేయడం గొప్పవరం


సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, సిబ్బంది

- మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత
- బదిలీపై వెళ్లిన ఏఈకి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాసేవ చేయడం గొప్ప వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న సంజయ్‌కుమార్ మణికొండ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తుండటంతో శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడాన్ని ప్రతిఒక్కరూ అదృష్టంగా భావించాలన్నారు. ఏఈ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు భరత్, బాలాజీ, శంషాబాద్ రాజు, శ్రీశైలం నాగరాజు, నాయకులు శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల భారిన పడకుండా జాగ్రత్తలు ఎలా చేపట్టాలి.. ఎలాంటి నియమాలు పాటించాలి.. సైబర్ నేరాలను ఎలా గుర్తించాలి.. ఎలా అప్రమత్తం అవ్వాలి అనే అంశాలపై ఈ సందర్భంగా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా ఆధారంగా సైబర్ నేరగాళ్ల యువతను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని, గుడ్డిగా అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్ నాయక్, సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ సీఐ రవికుమార్

అడుగడుగునా గుంతలు

- కంకర తేలి గుంతలమయంగా రోడ్లు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రహదారులు కంకర తేలి గుంతలమయంగా మారాయి. దీంతో వహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బ్యాతోల్, ఎర్దనూర్, వడ్డేనగూడ తండా, కొయ్యగుండు తండాతో పాటు ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ బైపాస్ రోడ్డు, మక్త అల్లూర్, ఉత్తర్‌పల్లికి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షం కురిసిన సమయంలో రోడ్లపై నుంచి నీరు పారుతుండటంతో వాహనాలు అదుపు తప్పి గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. మండల పరిధిలోని చేర్యాల రోడ్డుపై కూడా కంకరతేలి పలు చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రహదారిపై నుంచి నీటి ట్యాంకర్లు, కంకర, ఇసుక లారీలు వెళ్తుండటంతో చాలాచోట్లా రెండు అడుగుల లోతు రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈ దీపక్‌ను వివరణ కోరగా రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు.


గుంతలమయంగా బ్యాతోల్ రోడ్డు

రావూస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్

సదాశివపేట(సంగారెడ్డి): విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తున్న రావూస్ స్కూల్స్ గుర్తింపును రద్దు చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రావూస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రావూస్ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. అంతేకాకుండా పుస్తకాలు, డ్రెస్‌లు టై, షూస్ వంటి వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థుల పేర్లను తప్పుగా నమోదు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు వెళ్తామంటే టీసీలు బోనాఫైడ్‌లు ఇవ్వడంలేదన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఎంఈఓ వెంటనే స్పందించి రావూస్ పాఠశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.


ఎంఈఓ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ రుణమాఫీ ప్రకటనపై హర్షం

సదాశివపేట(సంగారెడ్డి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించినందునా పట్టణంలోని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య కార్యాలయం వద్ద ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ అధ్వర్యంలో రైతులు స్వీట్లు తినిపించుకున్నారు. సమాఖ్య నాయకులు వెంకట్‌రావు, శివయ్య, జ్ఞానోభ, సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

సంగారెడ్డి టౌన్: కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కౌలు రైతుల సంఘం రాష్ట్ర గొల్లపల్లి జయరాజు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. రైతు సంఘం నాయకులు రాజయ్య, నర్సింహరెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

◆ పిచ్చిమొక్కలను తొలగించాలి

పటాన్‌చెరు టౌన్: వాకింగ్ ట్రాక్‌లో ఎప్పటికప్పుడు పిచ్చిమొక్కలను తొలగించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని బ్లాక్ ఆఫీస్ ఆవరణంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను కార్పొరేటర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను పారిశుధ్య కార్మికులతో తొలగింపజేశారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

◆ కాలుష్య నివారణకు కృషి చేయండి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ కాలుష్య నివారణకు కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది, పర్యావరణ వేత్త దండె రమాకాంత్ అన్నారు. కాలుష్య నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఖాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని రమాకాంత్ తెలిపారు.

అధికారులతో సమీక్ష సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని వార్డు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అధికారులతో డివిజన్ కార్పొరేటర్ పుష్ప శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సండే మార్కెట్ బస్సురూట్, హిందూ శ్మశానవాటిక నుంచి మైనార్టీ శ్మశానవాటిక వరకు సెంటర్ లైటింగ్‌తో కూడిన డివైడర్‌ను ఏర్పాటు, తదితర సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో చర్చించారు.

◆ ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

జహీరాబాద్ టౌన్: ఉపాధిహామీ పథకం ద్వారా మొగుడంపల్లి మండలంలో చేపట్టిన పనులపై శనివారం ఎంపీపీ సమావేశ మందిరంలో సామాజిక తనఖీ ప్రజావేదిక నిర్వహించారు. అడిషనల్ డీఆర్‌డీఓ బాలరాజ్, డీపీఓ నాగేందర్ పాల్గొన్నారు.

◆ చిన్నారులకు అక్షరాభ్యాసం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని మాదారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు శనివారం అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం అంజయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాలను దిద్దించారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం పారిశ్రామిక వాడలోని స్నేహ పరిశ్రమలో కార్మికుడు తేజేశ్వర్‌రావు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో పరిహారం ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు, నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి తదితరులు శనివారం పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. స్పందించిన యాజమాన్యం మృతుడి కుటుంబానికి రూ.21లక్షల పరిహారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించిన చెక్కును యాజమాన్యంతో పాటు నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

గాయపడిన వ్యక్తికి...

బొల్లారానికి చెందిన సయ్యద్ అమీర్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ యువజన నాయకుడు ప్రవీణ్‌రెడ్డి శనివారం సయ్యద్ అమీర్‌ను పరామర్శించాడు. అనంతరం వైద్య ఖర్చులకు గాను ప్రవీణ్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. అదేవిధంగా బాధితుడి మిత్రులు కలిసి రూ.15వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

రెగ్యులర్ అధ్యాపకులను నియమించండి

నారాయణఖేడ్: ఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకులంలో రెగ్యూలర్ అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌ను నియమించాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజునాయక్, సభ్యుడు నర్సాపూర్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 600మంది విద్యార్థులకు గాను 40మంది బోధనా సిబ్బంది ఉండాలన్నారు. కానీ.. ఆరుగురు మాత్రమే రెగ్యులర్ సిబ్బంది మాత్రమే ఉన్నారని తెలిపారు. మిగతావారు పార్ట్‌టైంగా విధులు నిర్వర్తిస్తున్నారని, ఇప్పటి వరకు వారిని విధుల్లోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ఉన్న ఆరుగురు మాత్రమే బోధన చేపట్టారని వాపోయారు. చాలామంది విద్యార్థుల తల్లిదండ్రులు టీసీలు తీసుకొని వెళ్లిపోతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి అధ్యాపకులను నియమించాలని కోరారు.

మురుగు కాలువలో పూడికతీత

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి, పిల్లోడి, పెద్దలోడి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని మురుగుకాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు కూలీలతో కలిసి శనివారం తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్‌లో శనివారం విద్యుదాఘాతానికి గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాల్‌రెడ్డికి చెందిన గేదెను తన వ్యవసాయ పొలంలో మేత మేపుతుండగా విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. కరెంట్ తీగలు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పరిహారం అందించాలని బాధితుడు కోరారు.

బొగ్గు గనులను ప్రైవేటీకరించొద్దు

జిన్నారం(పటాన్‌చెరు): బొగ్గు గనులను ప్రైవేటీకరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరుతూ గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ నాయకులు నిరసన శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ సింగరేణికి బొగ్గు గనులను అప్పజెప్పేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి ప్రాంతంలో బొగ్గు బ్లాకులను వేలం వేయొద్దని డిమాండ్ చేశారు. బొగ్గు గనులను ప్రైవేటు శక్తులకు అప్పజెప్తే కార్మికులను కూడగట్టి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, రవి, హుస్సేన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు


జహీరాబాద్ టౌన్: బూచినెల్లిలో బండ్ల ఊరేగింపు


ఝరాసంగం: కక్కరవాడలో

● ఘనంగా ఏరువాక వేడుకలు

జిల్లావ్యాప్తంగా ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కాడెద్దులను ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. ఎడ్లబండ్ల ముందు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందు రైతులు వేడుకలను నిర్వహించుకుంటారు.


మునిపల్లి: గోవుకు పూజ చేస్తున్న జెడ్పీటీసీ మీనాక్షి

పేద విద్యార్థులకు చేయూత


బ్యాగులు పంపిణీ చేసిన ఫ్లష్ అకాడమీ ప్రతినిధులు, నాయకులు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్ 'ఫ్లష్' అకాడమీ చైర్మన్ సంతోషి శ్రీకర్, డైరెక్టర్ శివశ్రీకర్ రూ 3.5లక్షల విలువచేసే నోటుబుక్కులు, పెన్నులు, బ్యాగులు, వానగొడుగులు, కంపాక్సు బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పేద విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అశోక్ కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రఘునందన్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వానాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు కాలనీలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో అధిక వేతనం చెల్లిస్తూ అవుట్ సోర్సింగ్ సిస్టం మేనేజర్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారని, అన్నిచోట్ల వారిని తొలగించినా ఇక్కడ ఎందుకు తొలగించలేదని, వెంటనే సిస్టం ఆపరేటర్‌ను తొలగించాలని పలువురు కౌన్సిలర్లు తీర్మానం చేశారు. నూతనంగా 60మంది సిబ్బందిని తీసుకోవడం కోసం సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ సంగారెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు భరత్, బాలాజీ, నాగారాజు, పావని, మంజుల, జ్యోతి, రాంసింగ్, రవీందర్‌రెడ్డి, శంషాబాద్ రాజు పాల్గొన్నారు.